

ముందడుగు పడేనా?

పాలమూరు ప్రధాన స్టేడియంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణం ముందుకు సాగడం లేదు.

వివరాలు 8లో ▸



పిడుగును పసిగడదాం

ప్రత్యేక యాప్‌లతో వర్షం రాక, పిడుగు పాట్లను ముందుగానే తెలుసుకోవచ్చు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /23.6

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టడంతో పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురవచ్చు.

న్యూస్‌రీల్

50 మంది విద్యార్థులు గైర్హాజరు

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలో సోమవారం జరిగిన 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 383 మంది విద్యార్థులకుగాను 333 మంది హాజరయ్యారు.

సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

మదనాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొండా శ్రీనివాస్‌ను కలెక్టర్ తేజస్ పవార్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ జెడ్పీ సీఈఓ యాదయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఎంపీపీ జన్మదినం రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఈ విషయాన్ని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ చేయించిన కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు వివరించారు.

19న బహిరంగ వేలం

పెబ్బేరు రూరల్: వనపర్తి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోని దుకాణ సముదాయంలో ఖాళీ అయిన 4, 8 నంబర్ దుకాణాలకు ఈ నెల 19న మధ్యాహ్నం రెండు గంటలకు కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవ తెలిపారు. ఆసక్తిగలవారు 15వ తేదీ సాయంత్రం 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 4 నంబర్ దుకాణానికి ధరావాతు సొమ్ము రూ.50 వేలు, దరఖాస్తు రుసుం రూ.500, 8వ నంబర్ దుకాణానికి రూ.1.50 లక్షలు, దరఖాస్తు రుసుం రూ.500 ఎంపీడీఓ, ఎంపీపీ, వనపర్తి పేరిట డీడీ తీసి దరఖాస్తుతో జతపర్చాలన్నారు. వేలం రద్దు చేయడం, వాయిదా వేయడానికి పూర్తి అధికారం తమకే ఉంటుందని చెప్పారు.

ప్రారంభమైన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను అధికారులు సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో తెలుగు, హిందీ, ఉర్దూ పండిట్‌లు, పీఈటీల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమంలో మొత్తం 320 మంది ఉపాధ్యాయులు తమ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఈ ప్రక్రియను డీఈఓ రవీందర్ దగ్గరుండి పరిశీలించారు. అనంతరం షెడ్యూల్ ప్రకారం బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను ప్రకటించనున్నారు. వీటితోపాటు ఈ నెల 8న విడుదల కావాల్సిన హెచ్‌ఎంల జాబితా సైతం విడుదల కాలేదని తెలుస్తుంది. సీనియార్టీ జాబితాపై మంగళవారం అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంది. కానీ, ఇంకా లిస్టు రాకపోవడంపై పలువురు హెచ్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



'డబుల్' మాయ..!

నిబంధనలకు విరుద్ధంగా 223 మందికి రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు



వనపర్తిలోని పెద్దగూడెం వద్ద నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు

- కౌన్సిల్ తీర్మానంతో కేటాయించినట్లుగా ప్రచారం
- ఇళ్ల కేటాయింపు.. కౌన్సిల్‌కు సంబంధం ఉండని వైనం
- కొత్త పాలకవర్గంలో వెలుగులోకి..

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రం శివారు చిట్యాల, పెద్దగూడెం క్రాస్‌రోడ్డు, రాజాపేట శివారులో గత ప్రభుత్వం మొత్తం 1,345 రెండు పడక గదులు నిర్మించింది. ఈ ఇళ్లను జిల్లాకేంద్రంలో రహదారి విస్తరణలో నష్టపోయిన వారికి కేటాయించిన తర్వాత 543 ఇళ్లు మిగిలాయని.. వీటిని పేదలకు పంచుతున్నామని అధికారులు చెప్పుకొచ్చారు. ఈ ఇళ్ల కేటాయింపులో భారీ అవకతవకలు చోటు చేసుకున్నాయా..? అంటే అవుననే సమాధానమిస్తున్నాయని అధికారపార్టీ వర్గాలు. వివరాల్లోకి వెళ్తే.. మిగిలిన ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు గతేడాది మే 11న అధికారులు లక్కీడిప్ నిర్వహించారు. వచ్చిన దరఖాస్తుల్లో అధికారుల విచారణ అనంతరం 1,345 మంది అర్హులుగా తేల్చారు. అప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల కేటాయింపు లక్కీడిప్ ద్వారా కలెక్టర్ ఆధ్వర్యంలోనే చేయాల్సి ఉండటం.. కేవలం 543 ఇళ్లు మాత్రమే ఉండటంతో వార్డుల వారీగా లక్కీడిప్ నిర్వహించి లబ్ధిదారులకు కేటాయించారు. ఇదిలా ఉండగా మరో 223 ఇళ్లు దారిద్ర్యరేఖకు దిగువనున్న పేదలకు ఇచ్చినట్లు కౌన్సిల్ తీర్మానం ఉందని నాలుగు రోజుల కిందట జరిగిన విలేకర్ల సమావేశంలో పుర చైర్మన్ పుట్టపాగ మహేష్ తెలిపారు. అయితే ఈ ఇళ్లను ఎక్కడ పంపిణీ చేశారు.. ఎవరికిచ్చారు.. దరఖాస్తులు ఎప్పుడు స్వీకరించారు.. పరిశీలన ఎప్పుడు జరిగిందనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 223 ఇళ్లు కౌన్సిల్ తీర్మానంతో కేటాయించినట్లు బయటపడటంతో కొత్త పాలకవర్గం ఎలా ముందుకెళ్లాలని తర్జనభర్జన పడుతోంది. ఎమ్మెల్యే మేఘారెడ్డి ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయించాలా? లేక ఉన్నతాధికారుల ద్వారా విచారణ చేయించాలా?, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రికి ఫిర్యాదు చేయాలా.. అనే ఆలోచనలో ఉంది. డబుల్ ఇళ్ల కేటాయింపుపై ఉన్న కౌన్సిల్ తీర్మానాన్ని బయటపెట్టేందుకు మాత్రం పాలకవర్గ పెద్దలు చొరవ చూపడం లేదు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..



రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగాయి. దరఖాస్తులు స్వీకరించే వరకు మాత్రమే మా పని. కౌన్సిల్ ఆమోదంతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపునకు ఎలాంటి అధికారం లేదు. కౌన్సిల్‌కు.. ఇళ్ల కేటాయింపునకు ఎలాంటి సంబంధం ఉండదు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించా. కౌన్సిల్ తీర్మానంతో పంపిణీ చేసినట్లు నా దృష్టికి రాలేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా.

– ఎం.పూర్ణచందర్, పుర కమిషనర్, వనపర్తి

800 మందికి మొండిచెయ్యి..

పురపాలికలో 1,345 మంది రెండు పడక గదుల కేటాయింపునకు అర్హులుగా గుర్తించిన అధికారులు కేవలం 543 ఇళ్లు కేటాయించారు. మిగిలిన 800 మంది తమకు అన్యాయం జరిగిందటూ లబోదిబోమన్నారు. కౌన్సిల్ ఆమోదంతో కేటాయించినట్లు చెబుతున్న 223 ఇళ్లను సైతం పేదలకు ఇచ్చి ఉంటే అర్హుల సంఖ్య కాస్త తగ్గేదనే భావన నెలకొంటుంది. ఈ ఇళ్లు అర్హులకు అందాయా? లేదా అన్నది కూడా తేలాల్సి ఉంది. ఇప్పటికే అక్రమార్కుల ఇళ్లను గుర్తించామని, విచారణ చేపడతామని పుర చైర్మన్ పుట్టపాగ మహేష్ బాహాటంగానే చెబుతున్నారు. అత్యధికంగా బీఆర్ఎస్ నాయకులకే ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇప్పటి వరకు స్పందించకపోవడం గమనార్హం.

'ప్రజావాణి'కి ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి.. చిత్రంలో కలెక్టర్ తేజస్ పవార్

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి

వనపర్తి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి కోరారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత తొలిసారి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి ఆయన హాజరై అర్జీదారుల ఫిర్యాదులను వెబెక్స్‌లో సంబంధిత అధికారులకు సిఫారసు చేయటం, సమస్యపై చర్చించడాన్ని పర్యవేక్షించారు.

జిల్లా యంత్రం సమస్యల పరిష్కారానికి చూపిస్తున్న చిత్తశుద్ధికి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రగతిభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారం తన సారథ్యంలో నిర్వహించే ప్రజావాణిలోనూ ఈ విధానం అమలు చేస్తానని వెల్లడించారు. అర్జీల సత్వర పరిష్కారానికి ఇదొక చక్కటి అవకాశంగా పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయరంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. బుధవారం పాఠశాలల పునః ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మామిడి తోరణాలు కట్టి పండుగ వాతావరణం కల్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నట్లు తెలిపారు. జిల్లా రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని.. ఆందోళన అవసరం లేదని వివరించారు. సాగునీటిపారుదలశాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి కాల్వలు పరిశీలించాలని, పూడికతీత, మరమ్మతులుంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ తేజస్ పవార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పని చేస్తోందన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున నకిలీ విత్తనాలను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు 70 అర్జీలు వచ్చాయని.. పరిష్కారానికి సంబంధిత అధికారలకు సిఫారసు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.నగేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి హాజరైన అధికారులు

పెండింగ్ పనులు పూర్తి చేయించండి



కలెక్టర్ తేజస్ పవార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టి పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. సోమవారం పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన కలెక్టర్ తేజస్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కోసం తొలి విడతలో రూ.5 కోట్లు, రెండోవిడతలో రూ.32 కోట్లు, అగ్రికల్చర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. వీటితో పాటు వనపర్తి–పెబ్బేరు 9 కిలోమీటర్ల రహదారి, పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్స్ భవనం, రాజమహల్ ఆధునికీకరణ, మిగిలిన రహదారి విస్తరణ, పెబ్బేరులో స్టేడియం, టౌన్ హాల్ పనులు పూర్తి చేయాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వేసైడ్ మార్కెట్ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, టౌన్–2కు 33/11 సబ్ స్టేషన్, మెడికల్ కళాశాల తదితర అభివృద్ధి పనులు యధావిధిగా కొనసాగించి పూర్తి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గట్టుయాదవ్, మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి, నాయకులు అశోక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ప్రజావాణికి 8 అర్జీలు

వనపర్తి: ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఏఆర్ ఏఎస్పీ వీరారెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు 8 అర్జీలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో పరస్పర గొడవలకు సంబంధించి 3, భార్యభర్తల గొడవ ఫిర్యాదు 1, భూ తగాదాలకు సంబంధించి 4 అర్జీలు దాఖలయ్యాయని చెప్పారు.



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఏఆర్ ఏఎస్పీ వీరారెడ్డి

మోదీతోనే సుపరిపాలన సాధ్యం

- జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశంలో సుపరిపాలన సాధ్యమని జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలో మంగళ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించిన అనంతరం రాజీవ్‌చౌక్‌లో పార్టీ శ్రేణులు, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఐదేళ్లలో పార్లమెంట్‌లో బీజేపీ బలం రెట్టింపు అయ్యిందన్నారు. రాష్ట్ర నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవులిచ్చి తెలంగాణకు సముచిత స్థానం కల్పించారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, పురుషోత్తంరెడ్డి, రామన్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, అశ్విని రాధ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి



కృష్ణమ్మకు జలకళ

ఎగువన ఉన్న కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు కృష్ణానదికి వరద కొనసాగుతోంది. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్ మండలం పస్పుల పుష్కరఘాట్ జలకళను సంతరించుకుంది. వానాకాలం ప్రారంభంలోనే వరదలు వస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– మక్తల్

నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నేతల పోటీ

- పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వచ్చిన అవకాశం
- రాష్ట్ర, జిల్లాస్థాయి పోస్టుల కోసం మొదలైన ప్రయత్నాలు
- ఉమ్మడి జిల్లాలో ఆలయాల చైర్మన్లకు డిమాండ్
- కేటాయింపుల్లో సీఎం జిల్లాకు ప్రాధాన్యం దక్కేనా..?

ఆశల పల్లకీలో..



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల సందడి మొదలైంది. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ నేతల్లో అధికార పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. లోక్‌సభ ఎన్నికలు సైతం పూర్తి కావడంతో త్వరలోనే పెద్ద సంఖ్యలో ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేయనున్నారన్న ఊహాగానాల నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కాంగ్రెస్ నేతలు పదవుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ పోస్టులతోపాటు ఉమ్మడి జిల్లాస్థాయి పోస్టులకు సైతం తీవ్రమైన డిమాండ్ నెలకొంది. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడిన నేతలంతా ఈసారి తమకు తప్పకుండా అవకాశం లభిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఇప్పటికే పలువురికి అవకాశం

రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవుల కోసం ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్యనేతలు ముమ్మర ప్రయత్నాలు చేశారు. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉమ్మడి జిల్లాలోని పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలకు రాష్ట్రస్థాయి పదవులు వరించాయి. ప్రధానంగా పార్టీ సీనియర్ నేత చిన్నారెడ్డికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా అవకాశం లభించగా.. ఏపీ జితేందర్‌రెడ్డి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పదవి పొందారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఒబేదుల్లా కొత్వాల్, శివసేనారెడ్డికి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, గురునాథ్‌రెడ్డికి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, చింతలపల్లి జగదీశ్వరరావుకు మైనర్ ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. వచ్చే విడతలోనైనా తమకు అవకాశం దక్కుతుందని మరికొందరు ఆశావహులు వేచి చూస్తున్నారు. రాష్ట్రస్థాయి పదవులతోపాటు జిల్లాస్థాయిలోని నామినేటెడ్ పదవులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాత వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేసింది. వీటి స్థానాల్లో కొత్త పాలకవర్గాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

మున్సిపాలిటీల్లో అవిశ్వాసాల వైపు..

నాగర్‌కర్నూల్‌లోని నాలుగు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టడంతో చైర్మన్ పదవులు దక్కించుకునేందుకు కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్లు దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. కొల్లాపూర్‌లో అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్ రమ్యను మున్సిపల్ చైర్మన్ పదవి వరించింది. త్వరలోనే అచ్చంపేటతోపాటు మిగతా మున్సిపాలిటీల్లోనూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు.

20 వరకు పదవులు..

ఉమ్మడి పాలమూరులోని ఒక్కో జిల్లాకు సుమారు 20 వరకు నామినేటెడ్ పదవులు ఉండగా.. వీటిలో గ్రంథాలయ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రముఖ ఆలయాల చైర్మన్ పదవులకు కాంగ్రెస్ నేతలు పోటీ పడుతున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల చైర్మన్ పదవులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. తమ పరిధిలోని పదవులను దక్కించుకునేందుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేల చుట్టూ కాంగ్రెస్ నేతలు ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఫలితాలతో సందిగ్ధం..

సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలుపును కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉండటంతో ఈ స్థానంలో పట్టు సాధించాలని చూశారు. అయితే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో విజయం సాధించగా.. మహబూబ్‌నగర్‌లో అపజయం పాలైంది. అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పెద్దల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో తమ వారికి పెద్ద సంఖ్యలో నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని అడిగేందుకు ఎమ్మెల్యేలు సైతం వెనకాడుతున్నట్లు సమాచారం. తాజా పరిణామాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో ఎంత ప్రాధాన్యత దక్కుతుందన్నది సందిగ్ధంగా మారింది.

కోడ్ ముగియడంతో..

లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు మొదలైందని తెలుస్తోంది. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నాయకుల పనితీరు ప్రాతిపదికనే ఆయా పదవుల కేటాయింపు ఉంటుందని ముఖ్య నేతలు స్పష్టం చేస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీలోని సీనియర్, ముఖ్య నాయకులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని భరోసా కల్పించారు. ఈ నేపథ్యంలో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన వారికి, గత ఎన్నికల్లో మంచి పనితీరు కనబరిచిన వారికే వాటిని కట్టబెట్టే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పదువులు పరిమిత సంఖ్యలో ఉండగా.. ఆశావహులు మాత్రం అధికంగా ఉండటంతో చివరికి ఎవరికి దక్కుతుందన్న దానిపై ఆసక్తి నెలకొంది.

ఈఎన్‌సీ అధికారుల పరిశీలన

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్–కంభాళాపురం మధ్య రూ.3.70 కోట్లతో చేపట్టే బీటీ పనులు ఆరేళ్ల కిందట నిలిచిపోయాయి. పంచాయతీరాజ్ రహదారిని బీటీగా మార్చడంతో తమకు నష్టం వాటిల్లుతోందని రహదారికి ఇరువైపులా పొలాలున్న రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. ప్రజల సౌకర్యార్థం రహదారి వేస్తున్నందున రోడ్డు విస్తరణ 20 ఫీట్ల వరకు చేపట్టాలని కోర్టు తీర్పునిచ్చింది. దీంతో సోమవారం ఈఎన్‌సీ అధికారులు రహదారిని పరిశీలించారు. గతంలో వేసిన రహదారి నాణ్యత, ఎంత విస్తీర్ణం వరకు నిర్మాణం చేపట్టారు.. పనులు ఏ స్థాయిలో ఉన్నాయనే విషయాలను పరిశీలించి పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు. పరిశీలనలో ఈఎన్‌సీ కనకరత్నం, సీఈ శివకుమార్, క్యూసీ ఎస్‌ఈ సుబ్బారావు, పీఆర్ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ మల్లయ్య, డీఈ చెన్నయ్య, ఏఈలు విద్యాసాగర్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.



రహదారి నాణ్యతను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ అధికారులు

క్లుప్తంగా

రైలులో నుంచి పడి వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలులో నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ అక్బర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌లోని బండమీదిపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి(35) రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం


శేఖర్(ఫైల్)

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొడ్డు శేఖర్(31)కు అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ పొలం వద్ద పురుగుమందు తాగాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. శేఖర్‌కు భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి

- ముగ్గురికి గాయాలు

కొల్లాపూర్ రూరల్: ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడికి పాల్పడిన ఘటన కొల్లాపూర్ మండలం ఎన్మన్‌బెట్లలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామశివారులో 22 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తుండగా.. తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో కూలీలు అక్కడి నుంచి పరుగులు తీశారు. తేనెటీగల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

- కేసు నమోదు

కేటీదొడ్డి: మైనర్ బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన కొండన్న అనే వ్యక్తి ప్రేమ పేరుతో వేధిస్తూ, అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు అతడిని మందలించినప్పటికీ.. ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. ఈక్రమంలో బాలిక తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. గత మే నెలలో బాలికపై సదరు వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈఘటనపై 29వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. ఎస్‌ఐ కేసు నమోదు చేయకుండా మానానికి వెలకట్టి, రాజీ కావాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం గద్వాల డీఎస్పీని బాధితురాలు కలిసి తన గోడును వెల్లబోసుకుంది. తనపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని వేడుకుంది. దీనిపై ఎస్‌ఐ శ్రీనివాసరావును వివరణ కోరగా.. మే 29న ఎలాంటి ఫిర్యాదు తన వద్దకు రాలేదని తెలిపారు. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ముందడుగు పడేనా..?


మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియం

సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకు ఎదురుచూపులు

- గత ప్రభుత్వ హయాంలో రూ.8కోట్లతో శంకుస్థాపన
- ట్రాక్ ఏర్పాటైతే అథ్లెట్లకు మెరుగైన ప్రాక్టీస్‌కు అవకాశం
- ఇప్పటికే మెయిన్ స్టేడియంలో పలు క్రీడా వసతులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు జిల్లా కేంద్రం క్రీడలకు హబ్‌గా మారుతోంది. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీ ఏర్పాటు కాగా, మరోవైపు స్టేడియంలో అధునాతనమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణమై క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చింది. స్టేడియంలో ఆధునీకరణ పనులు చేపట్టి ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, హైజంప్, బాస్కెట్‌బాల్ కోర్టులతోపాటు ఆర్చరీ జోన్ ఏర్పాటు చేశారు. అయితే మెయిన్ స్టేడియంలో అనేక క్రీడాసౌకర్యాలు ఉన్నప్పటికీ అథ్లెటిక్స్ క్రీడాకారులకు సింథటిక్ ట్రాక్ లేదు. గత ఏడాది అక్టోబర్ 6వ తేదీన పలు అభివృద్ధి పనులతోపాటు రూ.8కోట్ల నిధులతో చేపట్టనున్న సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. అయితే ఇంతవరకు సింథటిక్ ట్రాక్ ఏర్పాటుపై ముందడుగు పడనట్లు తెలుస్తోంది. నూతన రాష్ట్రప్రభుత్వ హయాంలో మెయిన్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు చేయాలని పలువురు సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

స్టేడియాన్ని పరిశీలించిన కేంద్ర సభ్యులు

ఖేలో ఇండియా పథకం కింద పలు జిల్లాల్లో అధునాతనమైన సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని మెదక్, వరంగల్ జిల్లాల్లో సింథటిక్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మహబూబ్‌నగర్‌లో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలోని మెయిన్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకు గతంలో ప్రణాళికలు రూపొందించారు. ఖేలో ఇండియా పథకం కింద మెయిన్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు కోసం ముందుగా జిల్లా యువజన, క్రీడలశాఖ ద్వారా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్)కు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు శాట్ నుంచి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్)కు ప్రతిపాదనలు పంపారు. మెయిన్ స్టేడియంలో 400మీటర్ల 8 లైన్ల సింథటిక్ ట్రాక్ ప్రతిపాదనలకు సంబంధించి 2021 అక్టోబర్ 22న ఖేలో ఇండియా కేంద్ర పరిశీలన కమిటీ సభ్యులు పరిశీలించారు. స్టేడియం అంతా తిరిగి సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించి ఫీజుబిలిటీ వివరాలు సేకరించారు. అయితే మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కేవలం ప్రతిపాదనలు పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి.


మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటును పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు (ఫైల్)

ఔత్సాహిక క్రీడాకారులకు వరం..

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుతో ఔత్సాహిక క్రీడాకారులకు ఎన్నో మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి. సింథటిక్ ట్రాక్‌లో అంతర్జాతీయస్థాయిలో సౌకర్యాలు ఉంటాయి. ట్రాక్ ఏర్పాటు అయితే మెయిన్ స్టేడియంకు గుర్తింపుతోపాటు సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుతో జాతీయస్థాయి పోటీలు జరిగే అవకాశం ఉంటుంది. జిల్లాకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు హైదరాబాద్‌లో కాకుండా ఇక్కడి సింథటిక్ ట్రాక్‌లో రెగ్యూలర్‌గా ప్రాక్టిస్ చేసే అవకాశం లభిస్తుంది.

శాట్‌కు ప్రతిపాదనలు పంపుతాం..



మెయిన్ స్టేడియంలో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటు కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపుతాం. అదే విధంగా మరోసారి శాట్ ద్వారా ఖేలో ఇండియాకు ప్రతిపాదనలు పంపించేలా తగిన చర్యలు తీసుకుంటాం. సింథటిక్ ట్రాక్ వస్తే జిల్లాలోని అథ్లెటిక్స్ క్రీడాకారులకు అంతర్జాతీయస్థాయిలో మెరుగైన ప్రాక్టిస్ సౌకర్యం లభిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి



మెయిన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలి. ఇప్పటికే మెయిన్ స్టేడియంలో ఎన్నో క్రీడ వసతులు ఉన్నాయి. ముఖ్యంగా అథ్లెట్ల కోసం సింథటిక్ ట్రాక్ వస్తే మెరుగైన ప్రాక్టిస్‌కు అవకాశం ఏర్పడుతుంది. సింథటిక్ ట్రాక్ లేకపోవడంతో చాలా మంది జిల్లా అథ్లెట్లు హైదరాబాద్‌లో ప్రాక్టిస్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కోసం కృషి చేయాలి.

– జి.శరత్‌చంద్ర, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

గురుకుల పాఠశాల భవనంలో నాగుపాము

కొత్తకోట రూరల్: పట్టణ శివారులో గల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల(వీపనగండ్ల) పాఠశాలలో భారీ నాగుపామును ఉపాధ్యాయ బృందం గుర్తించారు. పాఠశాల, కళాశాలకు వేసవి సెలవులు ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. 12న స్కూల్స్ పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాల సిబ్బంది తరగతి గదులను శుభ్రం చేస్తున్న క్రమంలో తరగతి గదిలో పెద్ద నాగుపాము బుసలు కొడుతూ కనిపించడంతో ఆందోళన చెందిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై అక్కడే ఉన్న ప్రిన్సిపాల్ దయాకర్‌కు చెప్పారు. ప్రిన్సిపాల్ వెంటనే స్నేక్ క్యాచర్ హోంగార్డ్ కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. ఆయన చేరుకుని నాగుపామును పట్టుకున్నారు. పాము నాలుగున్నర అడుగుల పొడవు, దాదాపు 20 సంవత్సరాలు వయస్సు ఉండవచ్చని స్నేక్ క్యాచర్ తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటంలో భాగంగా పాములను చంపవద్దని పాములు కనిస్తే తనకు సమాచారం ఇస్తే ప్రాణాలతో పట్టుకుని అడవిలో వదిలేస్తాని ఆయన తెలిపారు.


పామును బంధిస్తున్న స్నేక్ క్యాచర్ కృష్ణసాగర్

సమస్యల్లో సర్కారు బడులు


గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెట్టుకిందనే పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- 'అమ్మ ఆదర్శ పాఠశాలల్లో' నత్తనడకన అభివృద్ధి పనులు
- ఎంపిక చేసిన 298 పాఠశాలల్లో 88 బడుల్లోనే మౌలిక వసతుల కల్పన
- 210 పాఠశాలల్లో నేటికీ అసంపూర్తిగానే పనులు
- సరిపడా తరగతి గదులు లేక కొత్త ఏడాదిలోను విద్యార్థులకు తప్పని తిప్పలు
- పూర్తిస్థాయిలో అందని స్కూల్‌యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు

గద్వాల రూరల్: సర్కారు బడులు సమస్యలకు నిలయాలుగా మారాయి. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల విద్యార్థుల సరిపడా తరగతి గదులు లేకపోవడం, ఉన్న గదులు కాస్త శిథిలావస్థకు చేరడం, చాలా పాఠశాలల్లో తాత్కాలిక షెడ్లు వేసి పాఠాలు బోధించే దృశ్యాలు కనిపిస్తాయి. ఈక్రమంలో గతంలో మన ఊరు–మన బడి, తాజాగా అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు నత్తకునడక నేర్పేలా కొనసాగుతుండగా, చాలా చోట్ల స్థానికంగా నెలకొన్న రాజకీయ పోరు తోడవ్వడంతో పనులకు ఆటంకంగా మారాయి. ఇదిలా ఉంటే మరోవైపు జూన్ మొదటివారంలోనే పాఠశాలలకు చేరాల్సిన పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ నేటి వరకు పూర్తిస్థాయిలో చేరలేదు. దీనికి తోడు ఇటీవలి 2023–24 సంవత్సరానికి సంబంధించి విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే అట్టడుగు నుంచి రెండవ స్థానంలో దక్కించుకుంది. అలాగే ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. ఈనేపథ్యంలో ఈ ఏడాది విద్యాసంవత్సరంలో పునఃప్రారంభంలో పాఠశాలలో సమస్యలే విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి.

కొత్త పుస్తకాలు, యూనిఫాంలు అందలే..

పాఠశాలలో నెలకొన్న సమస్యలు ఇలా ఉంటే మరోవైపు విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు ఇంకా పాఠశాలలకు పూర్తిస్థాయిలో చేరలేదు. అన్ని పాఠశాలలో బాల, బాలికల విద్యార్థుల సంఖ్య 65,635 మంది ఉండగా వీరికి ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున స్కూల్ యూనిఫాంలను ఇవ్వాల్సి ఉంది. అయితే స్కూల్‌యూనిఫాం స్టిచ్చింగ్ బాధ్యతలు ఆయా ప్రాంతాల్లోని మహిళా సంఘాలకు అప్పగించగా వారికి ప్రభుత్వం ఇస్తున్న స్టిచ్చింగ్ డబ్బులు సరిపోవడం లేదంటూ స్టిచ్చింగ్ చేసేందుకు తటపటాయించారు. దీంతో చాలా చోట్ల ఇంకా స్కూల్ యూనిఫాంలు కటింగ్, స్టిచ్చింగ్ స్టేజీలోనే ఉన్నాయి. ఇప్పటి వరకు 55,876మంది విద్యార్థులకు సంబంధించి రెండు జతల డ్రెస్సులు స్టిచ్చింగ్ పూర్తికాగా ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. అదేవిధంగా ఇప్పటి వరకు పాఠ్యపుస్తకాలు ఎన్ని వచ్చాయి. ఎన్ని పాఠశాలలకు పంపిణీ చేశారు. అనే లెక్కలు కూడా చెప్పేందుకు విద్యాశాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

పదో తరగతి ఫలితాల్లో అట్టడుగున..

2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లా అట్టడుగు నుంచి రెండవ స్థానాన్ని దక్కించుకుందంటే సర్కారు బడుల్లో చదువులు ఎలా సాగుతున్నాయో చెప్పకనే చెబుతున్నాయి. అదేవిధంగా కొన్ని చోట్ల ఉపాధ్యాయుల ఖాళీలు కూడా వేధిస్తున్నాయి. మొత్తంగా జిల్లాలో ప్రభుత్వ విద్య ఆది నుంచి వెనకబాటుకు గురవుతూనే వస్తుంది. బడిబాట, బాలకార్మికుల నిర్మూలన వంటి కార్యక్రమాలను తూతూ మంత్రంగా చేపడుతూ కాగితాల మీద కాకి లెక్కలు చూపెడుతూ అధికారులు తప్పించుకునే విధానాన్ని అవలంభిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు స్పందించి అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమంలో భాగంగా పనులు వేగవంతం చేయించాలని.. విద్యార్థులకు ఏ ఇబ్బంది రాకుండా పాఠాలు బోధించాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే తలంపుతో చేపట్టిన అమ్మ ఆదర్శ పథకం పనులు నత్తకు నడక నేర్పేలా కొనసాగుతున్నాయి. అమ్మ ఆదర్శ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 298 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో తాగునీరు, శౌచాలయాలు, తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ నిర్మాణాలు వంటి ప్రధాన పనులు చేపట్టాల్సి ఉంది.

సరిపడా తరగతి గదులు ఏవి..?

జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్, కేజీబీవీ, గురుకుల ప్రభుత్వ పాఠశాలలు 465 ఉండగా ఇందులో 65,635మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. చాలా చోట్ల విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అయితే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో వీరికి తాత్కాలిక రేకుల షెడ్లు వేసి పాఠాలు బోధించే పరిస్థితి గతంలో చోటుచేసుకుంది. గట్టు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తరగతి గదుల కొరత కారణంగా విద్యార్థులకు చెట్ల కిందనే కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారంటే జిల్లాలో సర్కారు పాఠశాలలో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులను ప్రతిబింభిస్తాయి.

రెస్టారెంట్‌లో నిల్వ మాంసం గుర్తింపు

పాలమూరు: జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార భద్రత అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో తనిఖీలు అధికంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 8న వరంగల్ ఆహార భద్రత టాస్క్‌ఫోర్స్ బృందం ఎస్వీఎస్ సమీపంలో ఉన్న ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించగా నిల్వ ఉంచిన మాంసం దాదాపు 70 నుంచి 90 కిలోల వరకు లభ్యమైనట్లు సమాచారం. సదరు ఆహారం చాలా రోజులుగా ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి దానిని సదరు హోటల్‌కు వచ్చిన కస్టమర్లకు తయారు చేసి పెడుతున్నట్లు తెలుస్తోంది. అదే హోటల్‌లో లేబుల్ లేని వస్తువులు, కల్తీ పదార్థాలను ఆహారం తయారీకి వాడుతున్నట్లు గుర్తించి సదరు అధికారులు శాంపిల్స్ సేకరించినట్లు తెలుస్తోంది. హోటళ్లలో అధికారులు తనిఖీ చేసినట్లు ఓ ఫొటో, కథనం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై మహబూబ్‌నగర్ జిల్లా ఆహార భద్రత అధికారి మనోజ్‌ను వివరణ కోరగా కమిషనర్ ఆదేశాల మేరకు ఇతర జిల్లా బృందాలు జిల్లాలో తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు. సదరు బృందం ఇచ్చిన నివేదిక, శాంపిల్స్ అన్నింటిని కమిషనర్‌కు అందజేస్తారని చెప్పారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

నవాబుపేట: విద్యుదాఘాతంతో గొర్రెలు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సోమవారం మండల కేంద్రానికి చెందిన శివ తన గొర్రెలను తీసుకుని పొలం వద్ద మేపుతుండగా.. అక్కడ ఉన్న వ్యవసాయ బోరు కరెంటు తీగ తెగి పొలం కంచెపై పడింది. దీంతో కంచె పక్కన మేత మేస్తున్న ఆరు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు అప్రమత్తమై మిగతా వాటిని అక్కడి నుంచి దూరంగా తీసుకెళ్లటంతో మిగతా గొర్రెలు ప్రాణాలతో మిగిలాయి. కాగా చనిపోయిన గొర్రెలు దాదాపుగా రూ.60 వేల విలువ ఉంటుందని రైతు వాపోయాడు. సంబంధిత రైతు డీడీ కట్టినా.. కరెంటు లైన్ వేయకపోవటంతో అతడు కర్రలపై తాత్కాలికంగా వైర్లను తీసుకెళ్లారు. అవి గాలికి తెగి ప్రమాదం సంభవించిందని తెలియజేశారు. ఈ విషయంలో రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తాకి ఎద్దు..

భూత్పూర్: మండలంలోని కర్వెనలో సోమవారం విద్యుదాఘతంగా ఎద్దు మృతిచెందినట్లు గ్రామానికి చెందిన బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి చెప్పారు. గ్రామానికి చెందిన రైతు మల్లారెడ్డి తన వ్యవసాయ పొలం సమీపంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. భూమికి కొద్ది ఎత్తులో ఉండగా గడ్డి మేసుకుంటూ వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఎద్దు విలువ రూ.65 వేలు ఉంటుందన్నారు. పొలాలు చదును చేసుకునే సమయం కావడం, ఓ ఎద్దును కోల్పోవడంతో రైతు మల్లారెడ్డి తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు.


విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఎద్దు

పోస్టాఫీస్ ఎదుట కూలీల ఆందోళన



గట్టు: మండల కేంద్రంలోని పోస్టల్ కార్యాలయం ఎదుట సోమవారం ఉపాధి కూలీలు ఆందోళన నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మ ధ్యాహ్నం ఒంటి గంట వరకు కూలీలు పోస్టాఫీసు దగ్గరే డబ్బుల కోసం పడిగాపులు కాశారు. ఖాతా పుస్తకాలతో నిరసన తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు పోస్టాఫీసు ద్వారా నగదును చెల్లింపు చేస్తున్నారు. డబ్బులు డ్రా చేసుకునేందుకు కూలీలు పెద్ద ఎత్తున పోస్టల్ కార్యాల యానికి తరలి వచ్చారు. ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు పోస్టాఫీసు తెరచుకోలేదు. పోస్టల్ అ ధికారుల నిర్లక్ష్యంపై కూలీలు ఆందోళన చేశారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత పోస్టాఫీస్ తెరిచి, చెల్లింపులు నిర్వహించారు. ఈ వ్యవహారంపై బీపీఎం అంజలి వివరణ ఇచ్చారు. నగదును మాచర్ల పోస్టాఫీసు నుంచి తీసుకు రావడం వల్ల ఆలస్యమైందని ఆమె తెలిపారు. మాచర్ల పోస్టల్ శా ఖ వారు గద్వాల నుంచి నగదును తీసుకొచ్చి, ఇచ్చే సరికి మధ్యాహ్నం అవుతోందని, ఈ విషయం కూలీలకు ముందే చెప్పినట్లు బీపీఎం తెలిపారు.

కేసు నమోదు

అడ్డాకుల: కుటుంబ సమస్యల నేపథ్యంలో భార్యను కొట్టిన భర్తపై కేసు నమోదు చేసినట్లు అడ్డాకుల ఎస్‌ఐ ఎ.శ్రీనివాస్ తెలిపారు. కందూర్‌కి చెందిన నాగరాజు, జ్యోతి దంపతులు. సోమవారం ఇంటి వద్ద గొడవ పడ్డారు. నాగరాజు తన భార్యను కర్రతో కొట్టాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసున మోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

అలంపూర్: వ్యవసాయం పూర్వం సేంద్రియ ఎరువుల ద్వారానే జరిగేది. పూర్వీకులు రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించకుండానే పంటలు పండించేవారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార దిగుబడులు పెంచడానికి ఆధునిక వంగడాలతోపాటుగా రసాయనాల వినియోగించుకోవాల్సిన అవసరం నెలకొంది. రసాయన ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడుతూ దిగుబడులు పెంచుకోనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితులను అధిగమించి సేంద్రియం ద్వారా పంటల సాగు ఎంతో నయంగా ఉంటుందని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. వీటి వలన కలిగే లాభాలను రైతులకు వివరించారు.

రసాయనాల వాడకంతో..

- సాగులో విచక్షణ రహితంగా బస్తాల కొద్ది రసాయన ఎరువులను కుమ్మరించడంతో ఆ మందులను తట్టుకోనే స్థాయి పంటల్ని ఆశించే పురుగుకు పెరుగుతుంది.
- రసాయన ఎరువులు, పురుగుల మందులు అన్ని పంటకు అధికంగా వాడకంతో వాటిని తట్టుకోనే స్థాయి పురుగులు, తెగుళ్ల కాలక్రమేనా అధికమైపోతాయి.
- వీటి వినియోగం అధికంగా ఉంటే సాగు ఖర్చు విపరీతంగా పెరుగుతుంది.
- ఆహార ఉత్పత్తుల నాణ్యత తగ్గిపోతాయి.



- సరైన అవగాహన లేకుండా రసాయనాల వాడకం వలన వాటి అవశేషాలు నీటిలో, సాగు నేలలో కలిసి కలుషితమవుతాయి.

నష్టాలు–సూచనలు

- మితిమీరిన రసాయనాల వాడకంతో మిత్ర కీటకాలు నశించి పర్యావరణంలో వాతవరణ కాలుష్యం ఏర్పడుతుంది.
- ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి.
- వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనాలు లేకుండా చూసుకోవాలి.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యవసాయ ఒప్పందాల ప్రకారం మార్కెట్‌లో పోటీకి మన ప్రాంత రైతులు నిలవాలంటే నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి.
- పంట ఉత్పత్తులు తక్కువ ధరలకు లభించేలా సాగు చేసుకోవాలి.

సేంద్రియ విధానం

- సాగులో లింగాకర్షన బుట్టలు వాడాలి.
- ఎరిమితులకు లోబడి బీటీ వైరస్ శిలీంధ్రాన్ని వాడాలి.
- గంధకం, రాగి ఉత్పత్తులు వాడవచ్చు. వృక్ష సంబంధం నూనెల్ని కొన్ని జాగ్రత్తలతో వాడాలి.
- వేప సంబంధిత ఉత్పత్తులు, పచ్చిరొట్ట, వర్మీ కంపోస్టు ఎరువులను వాడాలి.
- పంట వ్యర్థాలు, కొబ్బరి వ్యర్థాలు, షజొల్లా ఉపయోగపడేవే.
- పంటల నుంచి వచ్చే బూడిద, జీవన ఎరువులు, జిప్సం పంటల్లో వాడుకోవచ్చు.

సేంద్రియ ఉత్పత్తులు..

- అంతర్జాతీయ మార్కెట్‌లో సేంద్రియ ఎరువులు నిలవాలంటే నిబంధనలు పాటించాల్సిందే.
- మన ప్రాంతంలోని నేలల్లో సేంద్రియ కర్బణం చాలా వరకు తగ్గిపోయి దిగుబడుల్లో రైతులు ఒడిదుడుకులను ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది.
- అనేక చోట్ల ఒక శాతం కర్బణం ఉన్నట్లు తెలుస్తోంది.
- సేంద్రియ కర్బనం పెంచడానికి కృషి చేయాలి.
- సేంద్రియ సాగు ద్వారా ఆహార ఉత్పత్తులు సాధించాలంటే ప్రపంచ దేశాలతోపాటు మన ప్రాంతంలో కూడా సేంద్రియ వ్యవసాయం చేసే రైతుల కమతాల్ని పరిశీలించి వారికి ధ్రువీకరణ పత్రం జారీ చేయడానికి కొన్ని ప్రమాణాలను ప్రభుత్వం నిర్దేశించింది. ఆ జాబితాలు సిద్ధం అవుతున్నాయి.
- ఏదైన ఆహార ధాన్యాలు సేంద్రియ ఉత్పత్తిగా గుర్తించాలంటే సాగులో అనేక ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది.
- సేంద్రియ వ్యవసాయ ఉద్యమాల అంతర్జాతీయ సమాఖ్య కొన్ని సాగు ప్రమాణాలను సూచించింది.
- అనేక దేశాల్లో కొద్దిపాటి తేడాతో ప్రమాణాలు పాటిస్తున్నారు.
- ప్రమాణాల ప్రకారం నాటే విత్తనాల దగ్గర నుంచి ప్యాకింగ్ వరకు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

సేంద్రియ ఎరువులతోనే సాధ్యం

- జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసే దిశగ రైతులు అడుగులు వేస్తున్నారు.
- సేంద్రియ ఎరువులైన వానపాముల ఎరువులు, పశువుల ఎరువులు, కోళ్ల ఎరువు, పచ్చి ఆకులు, పిండి చెక్కలు వాడాలి.
- నాణ్యమైన, రుచికరమైన ఉత్పత్తుల ను పండించి దేశానికి అందించాల్సిన అవసరం ఉంది.
- వ్యవసాయ శాఖ ద్వార చిన్న, సన్నకారు రైతులకు సైతం అందుబాటులో ఉండే వర్మీ కంపోస్టు బెడ్స్ రూ.5 వేల సబ్సిడీపై రైతులు పొందవచ్చు.
- జీలుగు, జనుము, పిల్లి పెసర విత్తనాలను 5 శాతం సబ్సిడీపై అందిస్తున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు దుర్మార్గం: కొంతం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం, ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లతో పాటు భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని తెలంగాణ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఇలా దాడులకు పాల్పడటం అనాగరికమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి అరాచకాలతో శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే కూటమికి అధికారం

- దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వద్దమూరి



మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: ఆంధ్రప్రదేశ్‌లో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి గెలుపొందిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. ఎన్నికల ఫలితాల్లో ఊహించని విధంగా ఆయా పార్టీలకు మెజార్టీ రావడంతో మేధావులు, విశ్లేషకులతో పాటు సామాన్య జనంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 12కి పైగా ఎన్నో ప్రముఖ సంస్థలు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడిస్తే అందుకు భిన్నంగా కూటమి విజయం సాధించడం వెనుక ట్యాంపరింగ్ జరిగిందనే అనుమానాలను కొట్టి పారేయలేమన్నారు. అందుకే ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈవీఎంలు తయారు చేసే సంస్థలు దాదాపు 30 ఉండగా, అందులో బీజేపీకి చెందిన వారివే ఎక్కువ సంస్థలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని గతంలో స్వయంగా చంద్రబాబునాయుడే ప్రకటించారని వడ్లమూరి గుర్తు చేశారు.


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ని పార్టీ ముఖ్య నాయకులు, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. చాలాసేపు పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీలు గొల్ల బాబురావు, మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, పాముల పుష్ప శ్రీవాణి, గుడివాడ అమర్‌నాథ్, నాయకులు రెడ్డి శాంతి, చిర్ల జగ్గిరెడ్డి, విశ్వాసరాయ కళావతి, బుట్టా రేణుక, చింతా అనురాధ, గొడ్డేటి మాధవి, శోభా హైమావతి, వంగా గీత, ధనలక్ష్మి, విజయ, డాక్టర్ సత్యవతి, ఉమాబాల, ఎల్ అప్పిరెడ్డి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.


గోపువానిపాలెంలో ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం


నంద్యాల మండలం రాయమల్పురంలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన అభివృద్ధి శిలాఫలకాలు


కూరాడ సచివాలయంపై ఉన్న వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలను గునపంతో పగలకొడుతున్న జనసేన కార్యకర్త

పరాకాష్టకు విధ్వంసకాండ

▶ మొదటి పేజీ తరువాయి

చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో ఎవరూ ఉండకూడదన్నట్లు బెదిరింపులకు దిగుతున్నారు. ఈ పార్టీకి ఓట్లేసిన వారిని దుర్భాషలాడుతున్నారు. ఓట్లు వేయించిన వారు ఊరు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇది అన్యాయం కదా.. అని ప్రశ్నిస్తే దుస్తులు విప్పి కొడుతున్నారు. ఏ తప్పూ చేయకపోయినా, వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పిస్తున్నారు. యూనివర్సిటీ వీసీలపై దౌర్జన్యం చేస్తున్నారు. పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఇదివరకు ఇలా ఎప్పుడైనా జరిగిందా? ఇప్పుడే ఎందుకు ఇలా జరుగుతోంది? టీడీపీ నేతలు, కార్యకర్తలు నేరుగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విధ్వంసం సృష్టిస్తుంటే.. ప్రభుత్వ ఆస్తులను పాడు చేస్తుంటే.. స్పందించాల్సిన పోలీసులు ఎందుకు చేష్టలుడిగి చూస్తున్నారు? నిజంగా ఈ పరిణామం ఖాకీ డ్రస్సుకే అవమానం.

దేశ చరిత్రలో ఇదివరకెన్నడూ లేని రీతిలో గత ఐదేళ్లలో గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు వెలిశాయి. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాలు, కొత్త రూపు రంగరించుకున్న స్కూళ్లు.. ఇలా ఎన్నెన్నో ప్రభుత్వ బిల్డింగ్‌లు నిర్మాణమయ్యాయి. ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయల విలువైన ఆస్తి సమకూరింది. ఇదంతా ప్రజలందరి ఉమ్మడి ఆస్తి. భద్రంగా కాపాడుకోవాలి. అలాంటిది పని గట్టుకుని ఊరూరా టీడీపీ సేన గునపాలు చేత పట్టుకుని ధ్వంసం చేస్తుండటాన్ని ఏమనాలి? రౌడీయిజం, దౌర్జన్యం, ఉన్మాదం.. ఇలా ఈ పదాలన్నీ తక్కువే. ఎవర్ని చూసుకుని ఇలా పేట్రేగిపోతున్నారు? చంద్రబాబు, లోకేశ్‌లను చూసుకునే కదా!

బాపట్ల జిల్లాలో పిండ ప్రదానం చేస్తుంటే అడ్డుకోవడం.. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ అభిమాని ఇంటిని జేసీబీతో కూల్చేయడం.. ఏకంగా నెల్లూరు మేయర్ దంపతులనే బెదిరించడం.. ఇదే జిల్లా దత్తలూరు మండలంలో జగనన్న లే అవుట్‌లోని ఇళ్లను ధ్వంసం చేయడం.. కొండాపురం మండలం గానుగపెంటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి ప్రహరీ, మెట్లు కూల్చేయడం.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేయడం.. ఇకపై పోస్టులు ఆపేస్తామని వారితో ప్రకటనలు ఇప్పించడం.. తప్పుడు కేసులు పెట్టడం.. ఇలా ఒక్కో ఊళ్లో ఒక్కో అరాచకం కళ్లెదుటే కనిపిస్తోంది ఒక్క పోలీసులకు తప్ప అందరికీ.

విగ్రహాలపై అక్కసు

- రెచ్చిపోయి వ్యవహరిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు
- గోపువానిపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం
- పలుచోట్ల శిలాఫలకాల తొలగింపు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

డిప్యూటీ సీఎంగా పవన్!

- జనసేనకు మరో నాలుగు మంత్రి పదవులు
- కూర్పుపై కసరత్తు చేస్తున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గంలో చేరడం దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూనే ప్రధాన ప్రతిపక్షంగా సభలో అడుగు పెడతామని చెప్పడంతో పలు ఊహాగానాలు సాగాయి. అయితే తాజాగా పవన్ ప్రభుత్వంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి. చంద్రబాబు, పవన్ మధ్య జరిగిన చర్చలో దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. పవన్ ఉప ముఖ్యమంత్రి హోదాలో పంచాయతీరాజ్ – గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తనతోపాటు జనసేన నుంచి గెలిచిన మరో నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని పవన్ కోరగా చంద్రబాబు అందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో ఒకటి నాదెండ్ల మనోహర్‌కి దక్కడం ఖాయమని చెబుతున్నారు. మిగిలిన పదవులకు కందుల దుర్గేష్, పంతం నానాజీ, అరణి శ్రీనివాసులు, వంశీకృష్ణ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి.

నేడు టీడీపీ శాసన సభాపక్ష సమావేశం

టీడీపీ శాసనసభాపక్ష సమావేశం మంగళవారం జరగనుంది. సమావేశంలో చంద్రబాబును తమ నేతగా ఎన్నుకోనున్నారు. ఆ తర్వాత ఎన్డీఏ ఎమ్మెల్యేల సమావేశం జరగనుంది. దీనికి టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా పదవులు

చంద్రబాబు ఉమ్మడి జిల్లాల వారీగానే మంత్రి పదవులు ఇస్తారని చెబుతున్నారు. ఒకరిద్దరు ఎమ్మెల్సీలను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. నారా లోకేశ్ మంత్రివర్గంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మంత్రి పదవుల కోసం టీడీపీలో తీవ్ర పోటీ నెలకొంది. శ్రీకాకుళం జిల్లా నుంచి అచ్చెన్నాయుడు, గౌతు శిరీష, కూన రవికుమార్, కొండ్రు మురళి రేసులో ఉన్నారు. అయితే శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కినందున అచ్చెన్నాయుడికి ఇవ్వటంపై సందిగ్ధం నెలకొంది. విజయనగరం జిల్లా నుంచి కళా వెంకట్రావు, సంధ్యారాణి పేర్లు వినిపిస్తున్నాయి. విశాఖ జిల్లా నుంచి అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత, పల్లా శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి జిల్లా నుంచి జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి రేసులో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణరాజు, పితాని సత్యనారాయణ పేర్లు వినిపిస్తున్నాయి. కృష్ణా జిల్లా నుంచి బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, కొల్లు రవీంద్ర పేర్లను పరిశీలిస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనందబాబు, అనగాని సత్యప్రసాద్, కన్నా లక్ష్మీనారాయణల్లో ఒకరిద్దరికి అవకాశం లభించనుంది. ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, బాల వీరాంజనేయ స్వామి పోటీలో ఉన్నారు. నెల్లూరు జిల్లా నుంచి పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశావహుల జాబితాలో ఉన్నారు. చిత్తూరు జిల్లా నుంచి అమర్‌నాథ్‌రెడ్డి, కిశోర్ కుమార్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా రేసులో పయ్యావుల కేశవ్, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత ఉన్నారు. కడప జిల్లా నుంచి రెడ్డప్పగారి మాధవిరెడ్డి, పుట్టా సుధాకర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, జయనాగేశ్వర్‌రెడ్డిలో ఒకరిద్దరికి చోటు దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది.

నేడు రాయలసీమలో భారీ వర్షాలు!

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు స్థిరంగా కదులుతున్నాయి. గాలుల కోత, షీర్ జోన్ ప్రస్తుతం సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. మరోవైపు మరఠ్వాడా ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. మంగళవారం రాయలసీమలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో, బుధవారం నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. గురువారం బాపట్ల, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురవవచ్చని పేర్కొంది.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



నారాయణపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీఓ 69, కృష్ణా-వికారాబాద్ రైల్వేలైన్ పనులతో పాటు ఆరు గ్యారంటీలు, నిరుద్యోగ భృతి, రుణమాఫీని అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తే, ప్రజాకోర్టులో దోషిగా నిలబెడతామని అన్నారు.

- పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర కేబినెట్‌లో సముచిత స్థానం లభించిందన్నారు. ఎంతో నమ్మకంతో ఓటువేసి గెలిపించిన ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను క్షేత్ర స్థాయిలో అందించేందుకు కృషి చేస్తామన్నారు. కేంద్ర మంత్రివర్గ విస్తరణలో ప్రధాని మోదీ అన్నివర్గాలకు సమన్యాయం చేశారని తెలిపారు. అదేవిధంగా ఏడుగురు మహిళలు, మరో ఏడుగురు మాజీ ముఖ్యమంత్రులకు అవకాశం కల్పించడంతో రాబోవు ఐదేళ్ల పాలన ఎంతో అద్భుతంగా ఉండబోతుందన్నారు. ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పలుమార్లు పర్యటించి శక్తియుక్తులను ఉపయోగించినా ప్రజలు డీకే అరుణను ఆశీర్వదించారని అన్నారు. సమావేశంలో రఘువీర్ యాదవ్, లక్ష్మి, సుజాత, వెంకట్రాములు, సాయిబన్న, రాము, కృష్ణ, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పిడుగును పసిగడదాం

- వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం
- వర్షాలు, పిడుగుపాట్లను ముందే తెలుసుకునే వెసులుబాటు

అందుబాటులోకి ప్రత్యేక యాప్‌లు



కల్వకుర్తి టౌన్: వానాకాలంలో ఎప్పుడు వర్షం కురుస్తుందో.. ఎక్కడ పిడుగు పడుతుందో తెలియదు. హఠాత్తుగా సంభవించే పిడుగుపాట్లతో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. మూగజీవాలు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లాలో అనేక మంది రైతులు, వ్యవసాయ కూలీలు పిడుగుపాట్లకు గురై ప్రాణాలను కోల్పోయారు. ఇలాంటి ఘటనలకు ఎవరూ గురికాకుండా అప్రమత్తం చేసేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ ఫోన్లలో గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఆయా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని.. వర్షం, పిడుగులు ఎప్పుడు పడతాయన్న సమాచారాన్ని ఇట్టే తెలుసుకోవచ్చు. ఆయా యాప్‌ల ద్వారా ఐదు రోజుల వరకు వాతావరణ పరిస్థితులు, మార్పులను తెలుసుకునే వీలు కల్పించింది. రైతులకు ఉపయోగపడే యాప్‌లపై గ్రామీణ స్థాయిలో అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

రైతులకు ఎంతో ఉపయోగకరం..



వాతావరణంలో వచ్చే మార్పులను గుర్తించేందుకు రూపొందించిన యాప్‌లు రైతులకు ఎంతో ఉపయోగపడతాయి. వర్షాలు, పిడుగులకు సంబంధించిన వివరాలను యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. యాప్‌లలో కచ్చితంగా 30–45 నిమిషాల ముందే హెచ్చరికలు వస్తుంటాయి. ఆయా యాప్‌లపై సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

– శ్యామ్, ఫిజిక్స్ లెక్చరర్, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, కల్వకుర్తి

మేఘదూత్..

తొలకరి జల్లులు కురిసిన తర్వాత పంటలకు ఎరువులు అందించాల్సిన సమయంలో లేదా.. వరి కోతల సందర్భంలో రైతులకు నష్టం చేసేవి వర్షాలు. అలాంటి వర్షాలను ముందే గుర్తించేందుకు వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌ను తీసుకొచ్చింది. గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే ఈ యాప్ ద్వారా రాబోయే 5 రోజులలో వాతావరణ మార్పులు, వర్ష సూచనలతో సహా గాలులు ఏ దిశగా వీస్తాయో తెలుసుకోవచ్చు.

రెయిన్ అల్లారం..

గూగుల్ ప్లేస్టోర్ నుంచి రెయిన్ అల్లారం యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత పూర్తి వివరాలను నమోదు చేయాలి. ఈ యాప్‌తో 20 కి.మీ. పరిధిలో ఎక్కడ ఎప్పుడు వర్షం పడే అవకాశాలు ఉన్నాయో తెలుసుకోవచ్చు. దీంతో ముందుజాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.

దామినీ..

వానాకాలంలో వర్షంతో పాటు అక్కడక్కడ పిడుగులు పడుతుంటాయి. రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమై ఉన్నప్పుడు అకస్మాత్తుగా కురిసే వర్షాలకు పక్కనే ఉన్న చెట్టు కిందకో లేక, మరో దగ్గరికి వెళ్తుంటారు. అలాంటివి అంత సురక్షితం కావని నిపుణులు పేర్కొంటున్నారు. పిడుగుపాటును ముందే గుర్తించేందుకుగాను దామినీ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీన్ని ద్వారా 20 కి.మీ. పరిధిలో 5నుంచి 20 నిమిషాలలో ఎక్కడ పిడుగు పడుతుందో తెలుసుకొని అప్రమత్తం కావొచ్చు.

వేర్వేరుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి..

వర్షాలు, పిడుగులను గుర్తించేందుకు రూపొందించిన ఆయా యాప్‌లను వేర్వేరుగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. వీటన్నింటిలో వేర్వేరుగా వివరాలను పొందుపర్చాలి. వివరాలను పక్కాగా అందించినప్పుడే సరైన సమాచారం సకాలంలో అందిస్తాయి.

సదరం స్లాట్.. ఇక నిరంతరం

- ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వం
- దివ్యాంగులకు తప్పనున్న వ్యయప్రయాసాలు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇక నుంచి వికలత్వ నిర్ధారణ పరీక్షలు నిరంతరం కానున్నాయి. ఈమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఎప్పుడైనా సదరం స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించింది. దివ్యాంగులకు సదరం ధ్రువపత్రం తప్పనిసరి. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో లబ్ధి పొందాలంటే సదరం సర్టిఫికెట్ ఉండాల్సిందే. అందుకు వైద్యారోగ్యశాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ సంయుక్తంగా ప్రతినెలా శిబిరాలు నిర్వహిస్తున్నారు. అర్హులైన దివ్యాంగులు ముందుగా స్లాట్ బుక్ చేసుకుని సదరం శిబిరాల్లో వైద్యులతో వికలత్వ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. వారి వైకల్య పరిస్థితి మేరకు తాత్కాలిక (రెండేళ్లు), శాశ్వత దివ్యాంగ ధ్రువపత్రాలు అందిస్తారు. తాత్కాలిక దివ్యాంగ సదరం సర్టిఫికెట్ పొందిన వారు గడువు పూర్తి కాగానే పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. అందుకు మళ్లీ మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని, శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది.

దివ్యాంగులకు ప్రయోజనం..



సదరం స్లాట్ బుకింగ్ నిరంతర ప్రక్రియగా మారింది. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు సైతం చేసుకుంటున్నారు. సదరం శిబిరాలకు నిరంతర స్లాట్ బుకింగ్‌తో దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుంది.

– నర్సింహులు, డీఆర్డీఓ

ఇబ్బందులకు చెక్..

ఇదివరకు సదరం స్లాట్ బుకింగ్ అంటే దివ్యాంగులకు ప్రయాసతో కూడిన పని. సదరం శిబిరం నిర్వహించే షెడ్యూల్‌కు వారం రోజుల ముందు స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించేవారు. నెలకోసారి నిర్వహించే శిబిరానికి 60 మందికి మాత్రమే అవకాశమిచ్చేవారు. దరఖాస్తుదారులు వందల్లో ఉండటం.. స్లాట్లు మాత్రం తక్కువ సంఖ్యలో ఉండటంతో స్లాట్ బుకింగ్స్ క్షణాల్లో అయిపోయేవి. దీంతో చాలామంది అర్హులైన దివ్యాంగులు మీసేవ కేంద్రాలకు వెళ్లే లోపే స్లాట్లు బుక్ అయిపోయాయన్న సమాధానం వచ్చేది. ఫలితంగా వారు నిరాశతో వెనుదిరిగేవారు. ఇలా ప్రతినెలా స్లాట్ బుకింగ్‌కు అవకాశమిచ్చినా.. సరిపడా స్లాట్లు లేక నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. స్లాట్ బుకింగ్ కోసం దివ్యాంగులు వ్యయప్రయాసాలతో తీవ్ర ఇబ్బందులు పడేవారు.

200 స్లాట్స్ విడుదల..


దివ్యాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సదరం స్లాట్ బుకింగ్‌ను నిరంతరం చేశారు. ఎప్పుడైనా స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోగానే, స్లాట్ ఉండే క్యాంపు తేదీ.. శిబిరం నిర్వహించే చోటు చూపిస్తుంది. ఒకవేళ స్లాట్ లేకపోతే వెయిటింగ్‌లో చూపిస్తుంది. స్లాట్ అందుబాటులోకి రాగానే.. దరఖాస్తు చేసుకున్న వారికి స్లాట్ కేటాయింపు జరుగుతుంది. ఈమేరకు మొబైల్‌కు మెసేజ్ కూడా వస్తుంది. దీన్ని ఆధారంగా ఆ తేదీన నిర్వహించే శిబిరానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. సదరం స్లాట్ బుకింగ్ నిరంతరం కావడంతో ఇప్పటికే చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల 200 స్లాట్స్‌ను డీఆర్డీఓ విడుదల చేశారు.

జూరాలకు స్వల్పంగా తగ్గిన వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం 3,830 క్యూసెక్కులు ఉండగా.. సోమవారం సాయంత్రానికి 3,806 క్యూసెక్కులకు చేరినట్లు వివరించారు. స్థానికంగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.936 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి 125 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు చెప్పారు.

శ్రీశైలంలో 809.0 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 809.0 అడుగుల నీటిమట్టం, 33.7180 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 4,052 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885.0 అడుగులు, నీటినిల్వ 215.8070 టీఎంసీలు.


శ్రీశైలం జలాశయం

రామన్‌పాడులో 1,013 అడుగులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,013 అడుగులు ఉన్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా నీటి సరఫరా లేదని.. సమాంతర కాల్వ నుంచి 27 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు చెప్పారు. తాగునీటి అవసరాలకు రోజుకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని తెలిపారు.

వైభవం.. బాలబ్రహ్మేశ్వరుడి రథోత్సవం

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రదోశకాలంలో నిర్వహించిన రథోత్సవం కనులపండువగా సాగింది. వారోత్సవంలో భాగంగా రథోత్సవం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అర్చకులు జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ఉంచారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కమలాపురం కవిత దంపతులు పాల్గొన్నారు. రథాన్ని ఆలయ ప్రాకార మండపంలో మూడుసార్లు ఊరేగించారు. భక్తులు ఓం నమః శివాయ.. ఓం శ్రీ మాత్రే నమః అంటూ స్మరిస్తూ రథోత్సవంలో పాల్గొన్నారు.


రథాన్ని లాగుతున్న న్యాయమూర్తి దంపతులు